## "పూర్తిగా తప్పు అడ్రెసుకు రాశాను ఆ ఉత్తరం!"

**తను ఉత్తరం రాసిన మూడోరోజు సుశీల కాలేజీకి వెళ్ళడం మానేసింది.**

ఆ రోజు సుధాకర్ దగ్గర్నించి తప్పకుండా జవాబు వస్తుందని ఎదురు చూస్తూ ఇంటి దగ్గిరే కూర్చుంది. గేటు తీసుకుని వాకిట్లోకి వస్తున్న పోస్టుమేన్ సాక్షాత్తూ దేవదూతలాగే కనిపించాడు.

సుశీలకో కవరు కూడా యిచ్చాడు. సుధాకర్‌కి యిచ్చిన పద్ధతిలోనే రాసివుంది యెడ్రస్. సంతోషంతో మూర్ఛ పోతాననుకుంది సుశీల.

పెద్ద కథ

# బూడిదలో పన్నీరు

## రంగనాయకమ్మ

కవరుచించి వుత్తరంతీసి గబగబా చదవడం మొదలెట్టి తుళ్ళిపడింది. మొహం చిట్లించింది. ఆశ్చర్యపడింది. ఉత్తరం అంతా చూస్తే చాలాకోపం వొచ్చింది. అది సుధాకర్ రాసిన జవాబు కాదు. ఎవరు రాశారో సంతకం వివరంగా తెలీడంలేదు. అతి ప్రయత్నంమీద చదివితే "మోహన్" అయివుండొచ్చని పిస్తోంది. ఉత్తరం అంతా వెకిలి మాటలతో పిచ్చి పిచ్చిగా వుంది. "ప్రేయసీ!" అని వుత్తరం మొదట్లోనే ఒక చెత్తకూత కూశాడు. "నీ హృదయం అన్యులకేగాని నాకు దక్కదా? నీ హృదయంమీద పడి ముద్దాడాలనీ, నిద్రించాలనీ నా హృదయం కలవరిస్తోంది ప్రేయసీ!". "నీకు దక్కని వాడికోసం యెందుకు అర్రులు చాసావు? మిగిలిన వాళ్ళెవరూ నీకు పనికిరారా!"

"నీ శయ్యపై నాకు చోటు ఇవ్వవా?"

జరిగిన కథ

సుశీల ప్రేమ కవి సుధాకర్‌కు లవ్‌లెటర్ రాసింది అతనా ఉత్తరాన్ని పదిమందికీ చూపించి తన కుసంస్కారాన్ని బయట పెట్టుకున్నాడు.

అందుకు బాధపడిన రామారావు అలా చేయవచ్చా? అని సుధాకర్‌ను అడిగాడు. ఫలితంగా రామారావు సుధాకర్‌ను అసహ్యించుకోవలసి వచ్చింది

[ఇక చదవండి]

సుశీల రెండు మూడుసార్లు అక్కడక్కడా చూసి కోపంతో వుత్తరం చింపేసింది. మొహమంతా జేవురించి, కోపంతో వొణుకుతూ కూర్చుంది— ఆలోచనల్లో మునిగి. సుధాకర్‌కి వుత్తరం రాసిన సంగతి ఇతని కెలా తెలిసింది? ఆ వుత్తరం చూశాడా ఇతను? ఎలా చూస్తాడు? సుధాకర్ ఏ బల్లమీదైనా పెట్టాడా? అతను రూమ్‌లోలేని సమయంలో ఇతను వొచ్చి వుత్తరం తీశాడా?— ఆలోచిస్తోన్నకొద్దీ ఆ చెత్త వుత్తరం ఒక గొప్ప సంతోష వార్తని మోసుకొచ్చిందన్న సంగతి అర్థమైంది తన వుత్తరం సుధాకర్‌కి చేరిందన్నదే ఆ సంతోషవార్త. తన వుత్తరం ఆయనకు చేరింది. అంతేచాలు. ఎక్కడో జాగ్రత్తపరిచే వుంటారు. ఈ దుష్టుడు ఆయనకు తెలీకుండా ఆ వుత్తరంచూసి ఆ ఎడ్రెస్ సంగ్రహించి వుంటాడు— అనుకుంటే సుశీల మనసెంతో తేలికపడింది. కొంత ఆతృత తగ్గి మధ్యాహ్నం కాలేజీకి బయల్దేరింది. బస్‌స్టాప్‌లో దిగి కాలేజీవేపు నడుస్తోంటే కేంటీన్‌లోంచి హడావిడిగా వస్తూ ఒక స్టూడెంట్ సుశీలతో పాటు నడవడం మొదలెట్టాడు.

"మీరిప్పుడే వస్తున్నారా?" అన్నాడు.

సుశీల కొంచెం ఆశ్చర్యపడి "అవునండీ" అంది.

"మీ పేరు సుశీలేకదూ? తెలుసులెండి- అవునోకాదో అని అడిగాను" అన్నాడు.

"అవును" అంది సుశీల ముభావంగా.

"మీకు కవిత్వం అంటే చాలా ఇష్టం కదండీ!" అన్నాడు.

సుశీల మాట్లాడలేదు.

"నేనూ కవిత్వం రాస్తానండీ, కొన్ని కవితలు కూడా పత్రికల్లో పడ్డాయి" అన్నాడు.

"నేనూ అంతే!" అంది.

"అదే మీ క్లాస్‌మేట్ సుధాకర్‌గారు మంచి కవిత్వం రాస్తారు కదండీ. మీకు తెలిసే వుంటుంది. మీకు కవిత్వం అంటే చాలా ఇష్టమని ఎవరో అన్నారు. నేనీ మధ్యనే నాలుగైదు కవితలు రాశాను. ఫ్రెండ్సంతా చదివి చాలా బాగున్నాయన్నారు. ప్లీజ్! మీరు కూడా చూస్తారా- శ్రమ అనుకోకపోతే" అంటూ పుస్తకాల మధ్యనించి ఒక నోట్‌బుక్ తీసి యివ్వబోయాడు.

సుశీల అతని ప్రవర్తనకి చాలా ఆశ్చర్యపడుతూ "నాకేం తెలీదు కవిత్వం గురించి. కావాలంటే సుధాకర్ గారికి చూపించండి ఆయనైతే యేమైనా సలహాలివీ యివ్వగలరు" అంది.

"ఆయనకీ చూపిస్తా ననుకోండీ. దయచేసి మీరుకూడా చూస్తే.... చాలామంది అభిప్రాయాలు సేకరిస్తున్నానండీ" అంటూ ఆ నోట్ బుక్ సుశీల మొహం దగిరికి తెచ్చి సుశీల చేతితో పుస్తకాల మీద పెట్టేయ్యబోయాడు

ఆ నోట్ బుక్ మీదనించి ఒకరకం సెంట్ వాసన కొట్టింది సుశీల మొహానికి. ముక్కూ మొహం యెరగని వ్యక్తి అంత మోటుతనంగా ఆ నోట్ బుక్ తన పుస్తకాలమీద పెడుతోంటే సుశీలకి వొళ్ళు మండిపోయింది.

"సారీ! నాకిషం లేదు. తీసేసుకోండి" అని అతని పుస్తకం అతనికిచ్చేసి తన దారిని తను వచ్చింది.

ఆ పూట క్లాసులో సుధాకర్ లేడు.

సుశీల మనసంతా గందరగోళంగా వుంది.

"నేనూ కవిత్వం రాసానండీ" — అనడం. తనని కవిత్వం చదవమని బలవంతపెట్టడం. తనకు కవిత్వం ఇషమని ఎవరో అన్నారనడం — అంతా అయోమయంగా వుంది. కేవలం కవిత్వం మీద అభిప్రాయం తెలుసుకునే ధోరణితో అడిగినట్టు లేదు. అయినా తన అభిప్రాయం ఎందుకు? తనేమన్నా కవిత్వం రాసే మనిషా?

సుధాకర్‌కి రాసిన ఉత్తరం సంగతి ఇతనికి కూడా తెలిసిందా? ఎలా తెలుస్తుంది? సుధాకర్ చూపించాడేమో! - ఛీ! ఏమిటీ ఆలోచనలు? సుధాకర్ చూపిస్తాడా? ఎందుకు చూపిస్తాడు? — లేకపోతే ఎలా తెలుస్తుంది వేరే వాళ్ళకి? ఆయన జేబులోంచి ఆ వుత్తరం ఎక్కడైనా పడిపోతే వీళ్ళెవరైనా చూశారేమో! లేకపోతే ఆ మోహన్ అనే అతనే సుధాకర్ రూమ్‌లో వుత్తరం చూసి ఇతకిని కూడా చెప్పాడేమో! ఏదో జరిగే వుండాలి. ఆ సంగతి బైటపడబట్టే వీళ్ళిలా ప్రవర్తిస్తున్నారు. తను యిషపడుతుందేమోనని వెకిలి ప్రయత్నాలు చేస్తున్నారు. సుధాకర్ అంత అజాగ్రత్తగా పెట్టుకున్నాడా తన ఉత్తరం? సుశీలకి పిచ్చెత్తినట్టుగా వుంది ఆలోచనల్తో. రమణి కూడా రాలేదు ఎందుకో. కాస్త మాటల్లోపడి మరిచిపోతే కొంతసేపైనా బాగుండేది- అని దిగులు పడింది.

రెండు పిరియడ్లు ఎలాగో గడిచాయి. లాస్టవరు ఖాళీ. అందరూ లేచి గబగబా



పరిగెత్తారు. సుశీల కూడా లేచి వెళ్ళబోతుంటే రెండు బెంచీల అవతలనుంచి రామారావు "సుశీలగారూ!" అని పిలుస్తూ దగ్గరికి వచ్చాడు.

"మీతో కొంచెం మాట్లాడాలండీ" అన్నాడు.

సుశీల ఆశ్చర్యపడుతూ, "ఏమిటి?" అంది.

రామారావు ఎలా చెప్పాలో తోచక తికమక పడ్డాడు.

"చెప్పండి" అంది పుస్తకాలు బెంచీ మీద పెట్టి.

"ఇక్కడకాదు. గార్డెన్‌లో ఎక్కడైనా కూర్చుంటే బాగుంటుంది"

"అసలు సంగతేమిటో చెప్పండి."

"సుధాకర్ గురించి కొంచెం మాట్లాడాలి మీతో." సుశీల ఆతృత అణుచుకుంటూ "సుధాకర్ గారేమన్నా చెప్పమన్నారా?" అంది కళ్ళు వాల్చి.

"అదికాదు. నేనే మీకు చెప్పాలనుకుంటున్నాను"

"సుధాకర్ గురించి నాకు చెప్పడం ఎందుకూ?" అని కొంచెం కోపం తెచ్చుకుంది.

ప్రముఖ పుస్తకములు
పోస్టు ద్వారా పొంది నెలకు
రూ 1,000/- సంపాధించండి

టి.వి. రేడియో&ట్రాన్సిస్టర్ గైడ్ ఒక్కొంటికి 35/-. టైలరింగ్&కటింగ్ గైడ్ 12/50. కామసూత్ర (వాత్యాయన) 15/-. వైవాహిక జీవితం 12/50 ఫొటో గ్రఫీ 12/50. సెక్స్ అట్లాస్ (యు ఎస్. ఏ) ప్రచురణ 15/-. 68 పడక గది బొమ్మలు 15/-. డ్రాయింగ్&పెయింటింగ్ 15/-. కోక్ శాస్త్రం (112 బొమ్మలతో) 15/- పోస్టేజి రు 4/- అదనం.

STAR BOOK DEPOT (AJ)
Chhapeti, Aligarh

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల ..చ్చలు

ఎ రకం తెల్లమచ్చలైనాసరే వానిరంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును అటుపైన మామూలు చర్మమువలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము వెంటనే వ్రాయండి

Address :
Shri Vastav Pharmacy
P. o. Katrisarai (GAYA)

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

డా॥ పి. వి. కె. రావ్. B. A.,
వె..వ్యాన్ ..ద్యాచార్య. సెక్స్ స్పెషలిస్ట్



.వాహము వాయిదా వేయ .వసరంలేదు. హస్త ప్రయోగం. నరముల బల హీనత. శీఘ్ర స్ఖలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స .లదు.

.. క్లినిక్,
టి బి రోడ్ తెనాలి. ఫోన్ : 700. 1010.

SUVARNA

"ప్లీజ్! నన్నర్థం చేసుకోండి. మీకు సుధాకర్ కి ఉత్తరం రాసిన సంగతి నాకు తెలుసు మీ విషయంలో అతను చాలా అసహ్యంగా ప్రవర్తిస్తున్నాడు. మీ ఉత్తరం అందరికీ చూపిస్తున్నాడు. నాకూ కూడా చూపించాడు."

సుశీల తన చెవులకేం మాటలు విన వడ్డాయో గ్రహించనట్లుగా, ఆ మాటలు అర్థం కానట్లుగా చూసింది మొదట. తెల్లబోతూ చూసింది. నమ్మకం లేనటు చూసింది. నిర్ఘాంతపోయినట్లు చూసింది. కొయ్యబారిన మనిషిలాగా అలాగే నిలబడి పోయింది

రామారావుకి భయం వేసింది– ఆ అమ్మాయి అలాగే నిలబడి ప్రాణాలు విడిచేసుందేమోనని. "ప్లీజ్ సుశీలా. ఎక్స్క్యూజ్‌మీ. ఎక్స్క్యూజ్‌మీ ..." అంటూ ప్రాధేయపడ్డాడు.

సుశీల నిలబడలేకపోతున్నట్లు బెంచీ మీద కూర్చుంది. డెస్క్ మీదకి తల వొంచేసుకుంది.

రామారావుకి చాలా తప్పు చేశానేమో ననిపించింది. చాలాకఠినంగా ప్రవర్తించానేమో ననిపించింది. సుశీలని పలకరించాలంటే భయం వేసింది.

ఇంకా జాగ్రత్తగా చెప్పాల్సింది. అంత తొందర పడకుండా చెప్పాల్సింది అని నొచ్చుకుంటూ నించున్నాడు

కొంతసేపటికి సుశీల లేచి పుస్తకాలు పట్టుకుంది.

"నా కెలా చెప్పాలో తెలీలేదండీ. మీకు చాలాబాధ కలిగించాను. నన్ను క్షమించండీ" అని మళ్ళీ ప్రాధేయపడ్డాడు.

"పదండి వెళ్దాం" అంది సుశీల గుమ్మంవేపు నడుస్తూ.

ఇద్దరూ లాండ్ స్కేప్ గార్డెన్ లో కూర్చున్నారు. గార్డెన్‌లో చాలా దూరంగా అక్కడక్కడా నలుగురైదుగురు స్టూడెంట్స్ మాత్రం వున్నారు.

కూర్చున్న తర్వాతకూడా రామారావు వెంటనే ప్రారంభించలేక పోయాడు. సుశీలకు నమ్మకం కలిగేలాగ చెప్పాలని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"చెప్పండి" అంది సుశీల చాలా దిగాలు పడుతూ.

"మీకెలా చెప్పాలో...."

"ఎలా జరిగితే అలా చెప్పండి."

"ఎలా జరిగిందో వింటే మీకు చాలా బాధ కలుగుతుంది. అసలు మీకీ విషయం చెప్పాలా వద్దా అని నేను చాలా ఆలోచించాను. చాలా విధాల ఆలోచించాకే మీకు తప్పకుండా చెప్పాలని నిర్ణయించుకున్నాను' అని ప్రారంభించి సుధాకర్ తన గదిలోకి రావడం. తనకో ఉత్తరం చూపించి చదవమనడం తను చదవడానికి సంకోచిస్తోంటే తనని వాతిడి చెయ్యడం నించీ అన్ని విషయాలూ చెప్పుకొచ్చాడు.

"ఇదంతా నిజమేనా?' అన్న సందేహంతోటీ, "సుధాకర్ ఇలా ప్రవర్తించాడా?" అన్న జుగుప్సతోటీ సతమతమై పోయింది సుశీల. సుధాకర్ తన వుత్తరం గురించి ఇతరులకు చెప్పేశాడనడానికి సాక్ష్యం దాని సంగతి బయటికి తెలియడమే. సుధాకర్ ప్రమేయం లేకండా అది ఎలాగో బైలువడిందని ఇంకా తనని తను నమ్మించుకోడానికి ప్రయత్నిస్తే అది తననితాను వంచించుకోవడమేనని సుశీలకి పూర్తిగా నమ్మకం కలిగింది. రామారావు మాటలు వింటూ సుశీల తన విచారాన్ని. కోపాన్ని ఆపుకోలేకపోయింది. "నిజంగా అన్నాడా ఆ మాటలు?" అని నాలుగైదు సార్లు మధ్య మధ్య అడిగింది.

"అతన్ని ఆకర్షించడానికే ఆ వుత్తరం రాసినట్టనుకున్నాడతను. ఆడపిల్లలు పెళ్ళి సంబంధాల కోసమే ఇలాంటి ప్రేమలు నటిస్తారన్నాడు" అని రామారావు చాలా సంకోచపడుతూ చెప్తే, సుశీల కత్తి దెబ్బ తగిలినట్టు చూసింది. ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. "నిజంగా అన్నాడా?" అని అడిగింది.

"ప్రామిస్. నన్ను నమ్మండి మీతో అబద్ధం చెప్పవలసిన అవసరం నాకేముంది? సుధాకర్ ప్రవర్తనకి నేను ఇప్పటికీ షాక్ అవుతున్నాను. ఇక మీరెంత అవ్వాలో! పరిస్థితిని కొంచెం జీర్ణించుకోడానికైనా అవకాశం లేకుండా విషయాలన్నీ ఒకదానివెనక ఒకటి గబగబా జరిగాయి. ఇదంతా జరిగిందా అని నా మనసు కిప్పటికీ సందేహంగానే వుంది. మీరు అతనికి ఉత్తరం రాసినందుకు నేను జెలసీగా ఫీలయ్యానని నా మీదకూడా పెద్ద అభాండం వేశాడు ఎందుకలా అనుకున్నాడో నాకిప్పటికీ అర్థం కావడంలేదు. 'నీకు పెళ్ళి సెటిల్లైపోతే ఆ మాటే చెప్పేస్తూ ఆ అమ్మాయి ఉత్తరం ఆ అమ్మాయికి పంపించేస్తే బాగుండేది కదా అని నేనడిగానని. ఇక అవాకులూ చెవాకులూ వాగడం మొదలెట్టాడు...."

సుశీల చెంపలు తుడుచుకుంటూ- "అతనలా చేస్తే ఎంత బాగుండేది!" అంది నెమ్మదిగా.

"ఎంత సామాన్యుడైనా అలాచేసాడు. ఇతను సామాన్యుడికన్నా హీనుడిగా వున్నాడనుకోవాలి. ప్రేమ ఆడవాళ్ళ మనసులో గుంభనగా వుండాలిగానీ, ఇలా బట్టబయలు కాకూడదట...."

"అంటే ?"

"ఏమో. అతనేమంటున్నాడో నాకూ అర్థం కాలేదు. "ప్రేమలేఖ రాయడం తప్పా ?" అని అడిగాను. ఏదో వాగాడు. చెప్పడానికి నాకే సిగ్గుగా వుంది. అతని గురించి ఈ విషయాలన్నీ మీకు తెలీక పోతే. అతను మీతో ఏం నాటకం ఆడతాడో. మీరేం చిక్కుల్లో పడతారో అని మీకు చెపుతున్నానుగానీ.... నన్ను నమ్ము తున్నారా నిజంగా? లేకపోతే నేను సుధాకర్ మీద చాడీలు చెపుతున్నాననుకుంటు న్నారా ?"

"నేనలా అనుకోడం లేదండీ. మీరు చెప్పేదంతా నిజమే ననుకుంటున్నాను."

ఆ వుత్తరం రాసిన తర్వాత సుశీలకి సుధాకర్ రెండు సార్లు కనబడ్డాడు. ఒక సారి క్లాసులో కనబడ్డాడు. ఒక సారి లైబ్రరీకి వెళ్తోంటే కనబడ్డాడు. అక్కడ అతను ఎవరితోనో మాట్లాడుతూ నించున్నవాడల్లా దూరంగా సుశీలని చూడగానే పక్కనే రాతి మీద కాలుపెట్టి. సిగరెట్ కాలుస్తూ. ఏదో పోజ్ ఇచ్చినట్టు నిలబడ్డాడు. సుశీలకు మనసు చివుక్కుమనిపించింది. అతనలా నించోడంలో ఏదో లెక్కలేనితనం. లక్ష్యంలేనితనం... అలాంటి ఏదో భావంతో అతను ప్రవర్తించినట్టనిపించింది. "అలా ప్రవర్తించాడేమిటి. అలా ప్రవర్తించాడేమిటి. అలా ప్రవర్తించాడేమిటి" అని సుశీల గుండె అప్పటి నించీ ఒక అపశ్రుతితో కొట్టుకుంటూనే వుంది. చాలాసార్లు దాన్ని మరిచిపోయినా ఎక్కడో గుర్తువుంటూనే వుంది.

రామారావు మాటలు వింటోంటే సుశీలకి తనా వుత్తరం రాయడం ఎంత పొరపాటైందో అర్థమౌతోంది. "ఎంత తొందర పడ్డాను". "ఎంత తొందర పడ్డాను:" అనే ఘోష ప్రారంభమైంది మనసులో.


"రామారావుగారూ: ఒక్క మాట చెప్పండి. అతన్ని ఆకర్షించడానికే నేనా వుత్తరం రాశాననుకున్నారా మీరుకూడా?"

"ఎందుకంత ఫీలవుతారు? నేనూ అలాగే అనుకున్నవాణ్ణయితే అతని గుంపులోనే చేరేవాణ్ణి కదా? ఈ సంగతులన్నీ మీకెందుకు చెపుతాను?" అని రామారావు అంటే సుశీలకు చాలా నమ్మకం కలిగింది.

రామారావు చాలా సీరియస్‌గా చర్చిస్తున్నట్టు అన్నాడు. "నేను ఒకరకంగానూ. మీరింకో రకంగానూ యిద్దరం పొరపాటు చేశామనిపిస్తోంది. అతని కవిత్వం మాత్రమే చూసి అతనితో స్నేహమో. ఇంకోటో కావాలనుకోడం పొరపాటు కాదూ? పాడగలిగేవాళ్ళు పాడతారు. ఆడగలిగేవాళ్ళు ఆడతారు. రాయగలిగేవాళ్ళు రాస్తారు వాళ్ళలో వుండే కళాత్మక శక్తిని మాత్రం చూసి దానివల్ల వాళ్ళు స్నేహితులుగానో ప్రియులుగానో పనికి వస్తారనుకోడం చాలా పొరపాటేనండీ."

ఒక కవి ఆరోగ్యవంతుడో కాదో చూడాలంటే డాక్టరు అతని కవిత్వం చూస్తాడా? అతని నాడి చూస్తాడు. గుండె చూస్తాడు. వూపిరి తిత్తులు చూస్తాడు. అలాగే ఒక కవి మంచి మనిషో కాదో





# కె. రాజశేఖరరెడ్డి

మన యువతరంలో క్రీడలపట్ల ఆసక్తి వుంది. సరియైన తర్ఫీదు లభిస్తే అనేకులు సమర్థులుగా రాణించగలరు. గుంటూరు బి ఆర్. స్టేడియంలో క్రీడలపట్ల ఆసక్తి కలిగించే వాతావరణం, పదుపాయాలు, అనుభవజ్ఞులయిన "కోచీ"లు గలరు. అందుకే అనతికాలంలోనే గుంటూరు క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలలో ప్రతిభావంతులుగా గుర్తింపు పొందుతున్నారు.

నేడు మన రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ ఆటలో వర్థమాన క్రీడాకారులు గుంటూరులో గలరు. అట్టివారిలో 18 ఏళ్ళ కె. రాజశేఖరరెడ్డి ఒకడు. రాజశేఖరరెడ్డి బాస్కెట్ ఆట గతకొద్ది సంవత్సరాలుగా ఆడుతున్నాడు.

మూడేళ్ళ క్రితం ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు బాలలతో ఆడి స్వర్ణపతకం కైవసం చేసుకున్నాడు. కొట్టాయం, జైపూర్‌లలో గత

## వర్థమాన క్రీడాకారులు

రెండేళ్ళలో జరిగిన అఖిల భారత పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టులో ఆడాడు.

బుర్ద్వాన్‌లో గత ఏడాది జరిగిన నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు రాజశేఖర రెడ్డి సారథ్యంలో ఆడి కాంస్య పతకం గెలుచుకొంది. అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో నాగార్జున విశ్వవిద్యాలయ జట్టులో ఆడాడు.

పాటియాలాలో నిర్వహించబడిన యువజన శిక్షణ శిబిరంలో కొంతకాలం తర్ఫీదు పొందాడు.

అంతర్జాతీయ పోటీలలో మనదేశం తరఫున ఆడాలి అనే పట్టుదలతో కృషి చేస్తున్నాడు. అవకాశం, ఇంకా తర్ఫీదు లభించిన తప్పక ప్రకాశించగలడు.

— మంకరమ్

మంచి స్నేహితుడిగా పనికివస్తాడో లేదో చూడాలంటే అతని వ్యక్తిగత జీవితం చూడాలి. అతని సంభాషణలు వినాలి. అతని ప్రవర్తన గమనించాలి. అంతేగానీ పుస్తకాల్లో రాసేదీ, వేదికలెక్కి మాట్లాడేదీ చూసి అదంతా నమ్మడం వాళ్ళు గొప్పవాళ్ళనుకోడం చాలా తెలివితక్కువేనండీ."


ఉచితం ఉచితం ఉచితం

**తెల్ల మచ్చలు**

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వానిరంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మమువలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి. **Address :**

Jeevan kalyan (B.D-8)
P.O. KATRI SARAI (GAYA)


"రాసినదాన్నిబట్టే రాసిన వాళ్ళ భావాలు తెలిసిపోతాయికదా!" అంది సుశీల చాలా అనాసక్తిగానూ, నిరుత్సాహంగానూ.

"భావాలకేంలెండి. ఏ భావాలవల్ల కీర్తి వస్తుందంటే ఆ భావాలు తమకు వున్నట్టు రాయొచ్చు. వాళ్ళు చాలా గొప్ప భావాలుగల వాళ్ళలాగా కనవడొచ్చు."

"అలాంటి వాళ్ళని తెలుసుకోలేమా!"

"ఏం తెలుసుకున్నాం యిప్పుడు? ఏమైంది యితని విషయంలో? ప్రేమ గురించి అతను యెంతెంత గొప్పలు రాశాడు! ప్రేమ గురించి సుధాకర్ యింత నీచంగా మాట్లాడగలడని నేనైతే కలలో కూడా అనుకోలేదు. ప్రేయసికోసం ఆకాశాలు వెతికేవాడు పాతాళానికి జారి డబ్బుకి అమ్ముడుపోతాడని అనుకున్నామా? "ఆ కవిత రాసినప్పుడైతే చాలా సిన్సియర్‌గా వున్నాడుగానీ తర్వాతే మారిపోయాడంటారా? నేనలా అనుకోను. అప్పుడూ దొంగే. ఇప్పుడూ దొంగేఅతను మనకి అనుభవాల్లేక అర్థం చేసుకోలేకపోయాం. మనకన్నా తెలిసిన వాళ్ళైతే ఆ కవితలోనే అతని స్వభావాన్ని కనిపెట్టేవాళ్ళేమో."

సుశీల చాలాసేపు మౌనంగా కూర్చుంది. తను చేసిన పనికి చాలా బాధపడుతున్నట్టుగా "మనిషితో కనీస పరిచయమైనా లేకుండా చాలాదూరం పోయాను.." అనేప్పటికే ఆమె కన్నీళ్ళు జలజల రాలి. కంఠం మూసుకుపోయి మాట్లాడలేకపోయింది.

"ఒక రకంగా అంతేనండీ. వ్యక్తిగత పరిచయం లేకండా ప్రేమ ఏమిటి? తెరవెనక నించో, తలుపు సందుల్లోంచో చూసి, మోహించి, అతనెలాంటివాడైనా అతన్నే పెళ్ళాడి, కాపరాలు చేసేరోజుల్లో అయితే అలాంటి ప్రేమలుగానీ. ఈ రోజుల్లో ఒకరి సంగతి ఒకరికి తెలీకుండా ప్రేమ లేమిటి? మీకిష్టంలేని విషయాన్ని కూడా పట్టించుకోకుండా ప్రేమించడం అంటే అది గుడ్డి ప్రేమకాదూ? లోపాలు చూడకండా సర్దుకుపోయేవాళ్ళు ఔన్నత్యాలు మాత్రం చూడగలుగుతారంటే నాకు సందేహమే.

సుధాకర్ అంగీకరించాడే అనుకోండి. అతనికి మీ గురించి తెలిసి, మీ భావాలు తెలిసి, మీ ప్రవర్తన తెలిసి, మీ వ్యక్తిత్వం తెలిసి వాటన్నిటినీ ఇష్టపడి కోరి అంగీకరించినట్లవుతుందా? "ఫలానా రోజు స్టేషన్‌కి రమ్మ'ని వుత్తరం వాస్తే స్టేషన్‌కి వెళ్ళినట్టుగా. నాకు ప్రేమ కలిగిందని వుత్తరం వాస్తే ప్రేమించడం సాధ్యమౌతుందా ఆలోచించండి. ఒకరికొకరు చాలా సన్నిహితంగా తెలిసి ఇష్టాలేర్పడుతూ వున్నప్పుడు ప్రేమలేఖలద్వారా మాట్లాడవచ్చునుగానీ.. ఏమో. ఇలాంటి ప్రేమల మీద ఆధారపడి పెళ్ళిళ్ల చేసుకుంటే అదంతా సవ్యంగా నడుస్తుందని నాకనిపించడం లేదు. సుధాకర్ మీ విషయంలో అంత నీచంగా ప్రవర్తించాడనే నా కంప్లయింట్‌గానీ, అతను మిమ్మల్ని ప్రేమించి తీరాలని నేను అప్పుడు కూడా అనుకోలేదు..... "ప్రేమ" విషయంలో మీరు ఒక తప్పటడుగు వేశారండీ. దాని ఫలితమే ఇంత అవమానం ఎదుర్కోవలసి వొచ్చింది."

రామారావు తననేదో అన్నాడని సుశీలకి బాధ కలగలేదు. అంతకన్నా ముందునించీ తన తెలివితక్కువ తనానికి తనని తను మందలించుకుంటూనే వుంది. రామారావు మాటలు సుశీలకి చాలా కొత్తగా, చాలా ఆశ్చర్యకరంగా కనిపించాయి. తను చేసిన తప్పేమిటో తనకి మొహంమీద కొట్టినట్టు బోధపడింది.

"నా వల్ల పొరపాటే జరిగిందనుకోండి. అతను మంచి స్నేహితుడిగా ప్రవర్తించి వుండకూడదా?"

"అలా ప్రవర్తిస్తే అతను మనంఅనుకున్న సుధాకర్ అయ్యేవాడు. అతనెలాంటివాడో గమనించలేకపోవడం మన తప్పవుతుందిగానీ. మన వూహల ప్రకారం ప్రవర్తించకపోవడం అతని తప్పెలా అవుతుంది?"

ఎంత మాట్లాడినా మళ్ళీ మళ్ళీ అదే.

ఇద్దరూ లేచారు.

బాధ పడొద్దనో, ధైర్యంగా వుండమనో, అంతా మరిచిపొమ్మనో, చెపుదామనుకున్నాడు రామారావు. జరిగింది మరిచిపొమ్మనడం, బాధ పడొద్దనడం ఇంకేదో అనడం వుత్త కంటి తుడుపు మాటలవుతాయిగానీ బాధ కలగకా మానదు జరిగిందంతా ప్రతీ క్షణం గుర్తు రాకా మానదు. నమ్మిన మనిషి తననంత అవమానం చేశాడన్న కోపమే కలిగితే అతని మీద ప్రేమ నశించడం ఎంతసేపు?

చెట్లకింద ఖాళీ ఆటో కనిపించింది.

"చీకటి పడుతోంది. బస్సు లేట్ కావచ్చు. ఆటోలో వెళ్తారా?" అన్నాడు రామారావు.

సుశీల ఆటో అతన్ని అడిగి ఆటోలో కూర్చుంది.

చీకట్లు అలుముకుంటోన్న కేంపస్ వాతావరణంలాగా సుశీల మొహమంతా యెంతో విషాదంగా కనిపించింది.

తర్వాత వారం పదిరోజులు సుశీల కాలేజీకి రాలేదు.


రామారావు చాలా ఆందోళన పడ్డాడు. సుశీలని చూడడానికి యింటికి వెళ్దామాఅని కూడా ఆలోచించాడు. చాలా దిగులు పడుతోందేమోనని విచారపడ్డాడు. ఒకసారి రమణినికూడా అడిగాడు సుశీల రావడం లేదేమని. "తనకి వొంట్లో బాగా లేదండీ" అంది రమణి.

సుశీల వచ్చిన్నాడు రామారావుకి చాలా సంతోషం కలిగింది. "బాగున్నారా?"అని పలకరించాడు. నవ్వి వూరుకుంది.

ఆ వారం పదిరోజుల్లోకూడా సుశీలకి సుధాకర్ దగ్గిర్నించి జవాబూ రాలేదు.

క్లాసులై పోయిన తర్వాత సుశీల రమణి నోట్ బుక్స్ చూస్తూ ఆమెతో మాట్లాడుతూ వుంటే సుధాకర్ సుశీల డెస్కు దగ్గిరికి వచ్చి– "సుశీలగారూ! మీతో కొంచెం మాట్లాడాలండి" అన్నాడు.

బిత్తరపోయింది సుశీల. అతనేమన్నాడో కూడా సరిగా వినలేదు ఆరోజు క్లాసులో సుధాకర్ వున్నాడా లేడా అని




ఆమె చూడలేదు. చూడాలని ఒక్కసారి కూడా అనిపించలేదు. సుధాకర్ తన దగ్గిరికి వచ్చి మాట్లాడతాడని అనుకోకపోవడంవల్ల కొంచెం కంగారు పడి సర్దుకొంది.

రమణి తన పుస్తకాలు తీసుకుని "నేనూ శకుంతలా బస్‌స్టాప్ దగ్గిర వుంటాం. తొందరగా వచ్చెయ్యి" అని చెప్పి వెళ్ళిపోయింది.

సుశీల కూడా పుస్తకాలు డెస్కులోంచి తీస్తూ "ఏమిటో చెప్పండి" అంది పుస్తకాలవేపు చూస్తూ.

"అలా కొంచెంసేపు గార్డెన్ వేపు వెళ్దాం. వస్తారా?" అన్నాడు సుధాకర్ నవ్వుమొహంతో.

"నాకంత టైమ్ లేదు. సంగతేమిటో చెప్పండి" అని పుస్తకాలు సర్దుతూ నించుంది.

తాను తొందరగా జవాబివ్వనందుకే అలక సాగిస్తోందనుకున్నాడు. "ఇలాంటి వ్యవహారాల్లో కాయితాలమీద కమిట్ కాకూడదని" ఒక మిత్రుడు ఇచ్చినసలహా ప్రకారం కాయితంమీద కమిట్ కాకూడదు కాబట్టి సుశీలకు జవాబు రాయకుండా సుశీల రాకకోసం ఎదురు చూస్తున్నాడు ప్రతి రోజూ. తన పెళ్ళి సంగతి ఆమెతో ప్రస్తావించకుండా వ్యవహారం ఎలా నడిస్తే అలా నడపాలనుకుంటున్నాడు.

"మీరు చాలారోజులు కాలేజీకి రాలేదే? ఆరోగ్యం బాగోలేదా?"

"అదేంకాదులెండి. మీరేదో మాట్లాడాలన్నారు చెప్పండి"

"అంత కోపంగా వున్నారేం? జవాబు రాయలేదనా? మీ లెటర్ అందిన తర్వాత చాలా బిజీ పనులవల్ల జవాబు రాయలేకపోయాను."

"ఫర్వాలేదు."

ఆమె ముందు డెస్కుమీద చెయ్యిఆన్చి, చాలా చొరవగా ఆమె హృదయాధిపత్యం తనదే అయినట్టు నవ్వుతూ- "నా రిప్లై కోసం మీరు చాలా యెదురు చూస్తున్నారు కదూ?" అన్నాడు.

"మొదట్లో అది, ఇప్పుడుకాదు." అని సరిన పుస్తకాలు చేతిలోకి తీసుకుంది సుశీల.

"అంటే?" అన్నాడు తెల్లబోతూ తనని చూడగానే పరవశించి చిరునవ్వులు చిందించడమో, కన్నీటిబొట్లు కురిపించడమో, ఇంత జాప్యానికి నిష్ఠూరాలాడడమో ఏదో చేస్తుం దనుకున్నాడు. ఆ సంభాషణలో మరో నాలుగు కవితలకు మేత దొరుకుతుం దనుకున్నాడు. అదేమీ జరగకపోయేసరికి జరిగిం దేమిటో క్షణాలలో గ్రహించాడు. "ఎవరో నా మీద మీకు చాలా చాడీలు చెప్పినట్టున్నారు" అన్నాడు నిష్ఠూరంగా.

"చాడీలు నమ్మేంత మూర్ఖురాలిని కాను. అనవసరపు చర్చలెందుకు? మీరేం మాట్లాడా లనుకున్నారో అది చెప్పండి" అంది మొహం చిట్లిస్తూ.

"మీరీమధ్య చాలా రోజులు క్లాసుకి రాలేదు. మీతో స్వయంగా మాట్లాడదామనే నేను జవాబు రాయలేదు."

"మీ జవాబు కోసం ఎదురుచూడడం లేదని చెప్పానుకదా? పొరగా తప్పు ఎడ్రస్‌కి రాశానా వుత్తరం! మీతో మాట్లాడం అనేది జరిగితే ఈ ఒక్క మాటే మీకు చెప్పాలనుకున్నాను." అని పుస్తకాలు తీసుకుని వెళ్ళబోయింది

"ప్లీజ్! కొంచెం ఆగండి. ఎందుకంత అపార్థం చేసుకున్నారు నన్ను? మీ మనసు ఎందుకిలా మారిపోయింది? మీ వుత్తరం జాగ్రత్తగా వుంచలేదనుకుంటున్నారా? ఎవరు చెప్పారు మీకు? కావాలంటే చూడండి. కావాలంటే మీ వుత్తరం మీరు తీసుకోండి." అని జేబులోంచి ఒక కవరు తీసి "ఇదుగో మీ వుత్తరం. తీసుకోండి" అంటూ వుత్తరం సుశీల చేతికి ఇవ్వబోయాడు.

సుశీల చాలా నిర్లక్ష్యంగా - "అక్కర్లేదు. మీ దగ్గిరే వుంచుకోండి. ఇంకా చూపించని వాళ్ళెవరైనా వుంటే వాళ్ళందరికీ చూపించుకోండి" - అని గుమ్మం వేపు వెళ్ళిపోయింది

**(అయిపోయింది)**